ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 7 ఫిబ్రవరి 2024 | 5

9న తునిలో వైఎస్ షర్మిల

రోడ్‌షో

వార్త..8లో



కందిపప్పు పంపిణీకి మంగళం పాడినట్టేనా?

అధిక ధరల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కార్డుదారులకు తక్కువ ధరకు అందించే కందిపప్పు పంపిణీకి ప్రభుత్వం మంగళం పాడిందా.. గతేడాది నుంచి జరుగుతున్న తతంగం చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. డిసెంబరు, జనవరి నెలల్లో కందిపప్పు కోటాలో సగానికి పైగా కోత పెట్టిన ప్రభుత్వం ఫిబ్రవరి నెలకు ఇంకా కోటా విడుదల చేయలేదు. దీంతో ఈనెల కోటా అనుమానమే.

- ఫిబ్రవరి నెల రేషన్ కోటా కేటాయింపులు నిల్
- డిసెంబరు, జనవరి నెలల్లో సగం మంది కార్డుదారులకే
- గత ఏడాది ఆరు నెలలపాటు పంపిణీ నిల్

పిఠాపురం, ఫిబ్రవరి6: బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు అధికంగా ఉన్న సమయంలో వాటిని గతంలో చౌకధరల దుకాణాల ద్వారా కార్డుదారులకు అందించే విధానానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే తెలుపురంగు రేషన్‌కార్డుదారులకు కిలో రూ.67కే కందిపప్పును అందించేవారు. కానీ కొంతకాలంగా కందిపప్పు రేట్లు గణనీయంగా పెరగడంతో ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పించుకుంటోంది. గత ఏడాదిలో ఆరు నెలలు కందిపప్పు పంపిణీ చేయలేదు. డిసెంబరు, జనవరి నెలల్లో సగం మందికి కూడా కందిపప్పు అందించలేదు. కాకినాడ జిల్లాలో 6 లక్షల 53 వేల 750 బియ్యం (తెలుపురంగు) కార్డులున్నాయి. ఈ కార్డుదారులకు క్రమంతప్పకుండా కందిపప్పును అందించాలంటే ప్రతీ నెలా 653 టన్నుల కందిపప్పును కేటాయించాల్సి ఉంటుంది. అయితే 2023లో ఆరునెలలపాటు కందిపప్పు పంపిణీని ప్రభుత్వం నిలిపివేసింది. నవంబరులో 50 శాతం కార్డులకు మాత్రమే కేటాయింపులు జరపడంతో ఆ నెలలో సరఫరా నిలిపివేసి డిసెంబరు నెలలో కోటాతో కలిపి అన్ని కార్డులకు ఇవ్వాలని భావించినా సాధ్యపడలేదు. చివరకు నవంబరు నెలలో వచ్చిన కోటానే సరఫరా చేశారు. సంక్రాంతి సమయంలో నూరుశాతం కార్డులకు వస్తుందని భావించినా గతంలోకంటే తక్కువగా కేటాయింపులు జరిపారు. కేవలం 43 శాతం కార్డుదారులకు అందించేందుకు వీలుగా 280 టన్నులు మాత్రమే కేటాయింపులు జరిపారు. దీంతో జనవరి నెలలో సంక్రాంతి పండుగ వేళ సగం మందికి కూడా కందిపప్పు అందలేదు. అప్పట్లోనే దీనిపై కార్డుదారులు నుంచి నిరసన వ్యక్తమైంది. ఫిబ్రవరి నెలలో అయినా పూర్తి కోటా వస్తుందని భావిస్తే మొత్తానికే ఎసరు పెట్టారు. ఇప్పటివరకూ జిల్లాకు కందిపప్పు కేటాయింపులు రాలేదు. వాస్తవానికి కందిపప్పు బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో రూ.200 వరకూ ఉంది. దీంతో కందిపప్పును కొనేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి తరుణంలో రేషన్‌కార్డుదారులకు కందిపప్పును అందిస్తే వారికి ఊరటగా ఉండేది. ఇంత రేటుకు కొనడం భారంగా ఉంటుందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా కందిపప్పును కార్డుదారులకు పంపిణీ చేసేవారు. బహిరంగ మార్కెట్‌లో ధర ఎంతున్నా ఎప్పుడూ పంపిణీ ఆగలేదు. ధరలు అధికంగా ఉన్నప్పుడు ఇస్తే తమకు వెసులుబాటుగా ఉంటుందని, ఇటువంటి తరుణంలో బాధ్యత నుంచి తప్పుకోవడం ఏమిటని కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు.

‘షో’.. అంతే!

- ఎన్నికలు దగ్గరపడ్డా జిల్లాలో ఆచరణకు నోచుకోని సీఎం జగన్ బహిరంగసభల హామీలు
- జిల్లాలో పర్యటనలకు వచ్చిన ప్రతిసారి సభల్లో ఎడాపెడా నిధుల మంజూరు ప్రకటనలు
- 2022లో గొల్లప్రోలు సభలో రూ.332 కోట్లకుపైగా నిధులు ఇచ్చేస్తున్నట్టు గొప్పలు
- తీరా ఇప్పటికీ పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలకు పైసా విదిల్చితే ఒట్టు
- సీఎం చెప్పారని పంపిన ఏలేరు, సుద్దగడ్డ ఆధునికీకరణ ప్రతిపాదనలు చెత్తబుట్టలో
- సామర్లకోట సభలో రూ.28కోట్లకుపైగా పలు పనులకు నిధులు విడుదల గొప్పలు
- మరో రెండు నెలల్లో ఎన్నికలొచ్చే అవకాశం ఉండడంతో సీఎం హామీలకు ఇక చెదలే





ఏటా ఇదే దుస్థితి : ఆధునికీకరణ జరగక ఏలేరు వరదతో మునిగిన ఓ పాఠశాల, పంటలు

సాక్షాత్తూ ముఖ్యమంత్రి జిల్లాకు వస్తున్నారంటే ఆయన పర్యటించే నియోజకవర్గంలో ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుంటారు. ఏళ్ల తరబడి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అనుకుంటారు. నిధులిచ్చి బాధలు తీరుస్తారని భావిస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వ పాలనలో జనానికి సులువుగా టోపీ పెట్టేయడం పరిపాటిగా మారింది. స్వయంగా సీఎం జగన్ జిల్లాలో వివిధ బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలు ఏళ్లు గడుస్తున్నా కనీసం ఆచరణకు నోచుకోవడం లేదు. సభల్లో గొప్పల కోసం అక్కడికక్కడే నిధులు మంజూరు చేసేశానంటూ ఆయన చెప్పిన ఆర్భాటపు మాటలు కేవలం మోసపూరితంగానే మిగులుతున్నాయి. తీరా బహిరంగ సభ అయిన తర్వాత ఏళ్లు గడిచినా ఏవీ ముందుకు కదలడం లేదు. ఇందుకు నిలువెత్తు నిదర్శనమే రెండేళ్ల కిందటి నాటి గొల్లప్రోలు సభ నుంచి గత నెల్లో కాకినాడ బహిరంగ సభలో ఇచ్చిన అబద్ధపు హామీలు. ఎన్నికలు రానున్న తరుణంలో వీటికి మోక్షం కలగడం ఇక అసాధ్యమే.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

మాట తప్పం.. మడమ తిప్పం అంటూ తరచూ వల్లెవేసే సీఎం జగన్ జిల్లాలో అధికారిక పర్యటనకు వచ్చినప్పుడు ఆర్భాటపు ప్రకటనలతో జనం చెవిలో పువ్వులు పెడుతున్నారు. సభలకు తరలిస్తున్న వేలాది జనాన్ని ఉద్దేశించి నియోజకవర్గానికి వరాలు ఇస్తున్నట్టు కలరింగ్ ఇవ్వడం, ఆ తర్వాత చప్పట్లు కొట్టించుకుని అవన్నీ మూలన పడేయడం పరిపాటిగా మారింది. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే అన్నట్టు మారాయి. సాధారణంగా ముఖ్యమంత్రి పర్యటనలో నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారంటే కనీసం ఆరు లేదా ఏడు నెలల్లో పనులు మొదలవుతాయి. నిధులు మంజూరై చకచకా పనులు పరుగులు తీస్తాయి. కానీ వైసీపీ పాలనలో మాత్రం అంతా రివర్స్. జిల్లా పర్యటనల్లోని సభల్లో గొప్పగా నిధులు మంజూరు చేస్తున్నట్టు చెబుతున్నా ఒక్క పైసా కూడా విడుదల కావడం లేదు. దీంతో పార్టీ ఎమ్మెల్యేలు సైతం జనం ముందు తలెత్తుకోలేకపోతున్నారు. పోనీ సభలో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని అడుగుదామంటే సీఎంను కలవడం ఎమ్మెల్యేలకు అసాధ్యంగా మారింది. దీంతో అడిగేనాథుడు లేక సీఎం హామీలు సరదా ప్రకటనలుగా మిగులుతున్నాయి. ప్రధానంగా 2022 జులై 28న సీఎం జగన్ పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలులో కాపునేస్తం సభకు హాజరయ్యారు. బహిరంగ సభలో అందరి ఎదుట వరాల వాన కురిపించారు. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణాల అభివృద్ధికి రూ.40 కోట్లు ఇస్తున్నట్టు గొప్పగా ప్రకటించారు. కానీ ఇంతవరకు ఒక్క రూపాయి విడుదలైతే ఒట్టు. దీంతో ఈ రెండు పట్టణాలు అభివృద్ధికి నోచుకోక ఈసురోమంటున్నాయి. అలాగే టీడీపీ ప్రభుత్వంలో దాదాపు చివరి దశకు వచ్చిన ఏలేరు ఆధునికీకరణ పనులను జగన్ సర్కారు వచ్చిన వెంటనే నిలిపివేశారు. తీరా మూడేళ్ల తర్వాత ఇక్కడి వచ్చిన సీఎం జగన్ మొదటి విడత పనుల పూర్తికి రూ.142 కోట్లు ఇస్తున్నట్టు ప్రకటించారు. రెండో విడతలో భాగంగా ఏలేరు, సుద్దగెడ్డ ఆధునికీకరణకు రూ.150కోట్లు నిధులు విడుదల చేసేసినట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో జల వనరుల శాఖ అధికారులు సవరించిన అంచనాలతో కొత్తగా అప్పట్లో ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. ఇప్పటికి రెండేళ్లు దాటుతోంది. కానీ ఒక్క పైసా కూడా మంజూరవలేదు. పంపించిన ప్రతిపాదనలు సీఎం పేషీలో మూలుగుతున్నాయి. పైగా ఈ రెండేళ్లలో అంచనాలు మళ్లీ భారీగా పెరిగిపోయాయి.

అంతన్నారు..ఇంతన్నారు...

పెద్దాపురం నియోజకవర్గంలో సీఎం జగన్ గతేడాది అక్టోబరు 12న పర్యటించారు. సామర్లకోటలో నిర్వహించిన పేదల ఇళ్ల ప్రారంభోత్సవ సభలో పెద్దాపురం నియోజకవర్గంపై ప్రేమ కురిపించారు. పెద్దాపురం రూరల్ పరిధిలోని కాండ్రకోట-తూర్పుపాలికల హైలెవెల్ బ్రిడ్జికి రూ.4 కోట్లు ఇచ్చేసినట్టు కలరింగ్ ఇచ్చారు. కాండ్రకోట పరిధిలో ఏలేరు కాలువపై డ్రాప్ కం బెడ్ రెగ్యులేటర్ పునర్నిర్మాణం కోసం రూ.6 కోట్లు ప్రకటించారు. తీరా ఇంతవరకు కాగితాలపై పనులు మూలుగుతున్నాయి. సీఎం చెప్పినట్టు చేస్తారేమోనని భావించి అధికారులు అప్పట్లో వేగంగా ప్రతిపాదనలు తయారు చేశారు. రెగ్యులేటర్ పనులకు రూ.9.4 కోట్లు, బ్రిడ్జికి రూ.4.50 కోట్లతో అంచనాలు రూపొందించి నిధుల విడుదలకు ప్రభుత్వానికి పంపారు. తీరా ఇంతవరకు వీటికి అతీగతీ లేదు. అసలు ప్రతిపాదనలు ఏస్థాయిలో ఉన్నాయో కూడా చెప్పే నాథుడు లేడు. సీఎం బహిరంగ సభల హామీలకు సంబంధించి ముఖ్యమంత్రి పేషీ నేరుగా పర్యవేక్షిస్తుండడంతో నిధుల గురించి జిల్లా అధికారులకు కూడా తెలియడం లేదు. అలాగే సామర్లకోట జూనియర్ కాలేజీని డిగ్రీ కాలేజీగా మార్చడానికి రూ.18 కోట్లు ఇచ్చేస్తున్నట్టు ప్రకటించి సీఎం చప్పట్లు కొట్టించుకున్నారు. కానీ ఫైలే సిద్ధం కాలేదు. చివరకు ఈ హామీలేమయ్యాయని అడగాలని నియోజకవర్గ ఇంచార్జి దవులూరి ప్రయత్నించినా సమాధానం చెప్పేవారు లేరు. గతనెల 3న సీఎం జగన్ కాకినాడలో పర్యటించి పింఛన్ల పెంపు సభలో ప్రసంగించారు. కాకినాడ నగరంలో మంచినీటి సమస్య పరిష్కారానికి రూ.47 కోట్లు ఇచ్చేసినట్టు చెప్పారు. కానీ నిధులకు అతీగతీ లేదు. తీరా వేసవి వచ్చేస్తోంది. ఇదిలాఉంటే ఈ నెలాఖరు లేదా వచ్చే నెల మొదటి వారంలో రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ ఏక్షణమైనా వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మరోపక్క ఇప్పటికే పార్టీల్లో ఎన్నికల హడావుడి కూడా మొదలైంది. ఈ నేపథ్యంలో సీఎం జగన్ ఇచ్చిన బహిరంగ సభల హామీలకు చెదలు పట్టినట్టే.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

ఈఆర్వోలు అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలి

జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 6: గత నెల 22న ముద్రించిన తుది ఓటర్ల జాబితాపై వచ్చిన అభ్యంతరాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారిణి కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. ఎన్నికల సన్నద్ధత, ఎలక్టోరల్ రోల్‌పై మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతికాశుక్లా.. జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య, వివిధ నియోజకవర్గాల ఈఆర్వోలతో కలిసి సమీక్షించారు. ఫారం-6,7,8 దరఖాస్తుల పరిష్కారం, తుది ఓటర్ల జాబితాలోని సమస్యలు, మార్పులు, చేర్పులు, 18-19 మధ్య వయసు గల ఓటర్ల వివరాలు, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ, పోలింగ్ కేంద్రాలు, ఈవీఎంలు, వీవీ ప్యాడ్స్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు, సెక్టోరియల్ సిబ్బంది నియామకం, శిక్షణ, మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఖాళీల భర్తీ వివరాలు వంటి అంశాలపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈఆర్వోలు అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలన్నారు. తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ నిబంధనలు అమలు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డీఆర్వో కె శ్రీరమణి, కాకినాడ కమిషనర్ జె వెంకటరావు, కేఎస్ఈజెడ్ ఎస్డీసీ కేవీ రామలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె సీతారామారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసరావు, డీపీవో కె భారతి సౌజన్య ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం ఎం శ్రీనివాసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ జి.నాగమణి

ప్రశాంతత,ఏకాగ్రతతో పరీక్షల్లో ఉత్తీర్ణత సాధ్యం

ఆర్జేడీ జి నాగమణి

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 6: ప్రశాంతతతో బాగా చదివి ఏకాగ్రతతో పరీక్షలు రాస్తే ఉత్తీర్ణత సాధించడం సాధ్యమేనని పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. గాడిమొగ రిలయన్స్ ఇండస్ట్రీస్ సామాజిక బాధ్యతలో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు నైపుణ్యం, స్వయం అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళిక అనే అంశాలపై అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. కాకినాడ దంటు కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్జేడీ నాగమణి, వ్యక్తిత్వ వికాస నిపుణులు, జేఎన్టీయూకే ప్రొఫెసర్ కేవీఎస్జీ మురళీకృష్ణ పాల్గొని విద్యార్థులకు పరీక్షలు, భవిష్యత్ ప్రణాళిక, కార్యాచరణపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తిచేశారు. ఈ సందర్భంగా ధీరూభాయ్ అంబానీ చిత్రంతో కూడిన పరీక్షల అట్టను, వ్యక్తిత్వ వికాస కరదీపికను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రిలయన్స్ మెకానికల్ హెడ్ డి.వేణుగోపాలరాజు, సీఎస్సార్ ప్రతినిధి పి.సుబ్రహ్మణ్యం, పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు, 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లా డీఈవోగా పి.రమేష్

ప్రకాశం జిల్లా డీఈవోగా దాట్ల సుభద్ర

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 6 : కాకినాడ జిల్లా డీఈవోగా పిల్లి రమేష్‌ను బదిలీచేస్తూ పాఠశాల విద్య ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. రమేష్ ప్రకాశంజిల్లా డీఈవోగా పనిచేసి పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉండగా కాకినాడ డీఈవోగా పోస్టింగ్ ఇచ్చారు. ఇప్పటివరకూ పాఠశాల విద్య జోన్-2 ఆర్జేడీ జి.నాగమణి కాకినాడ జిల్లా ఇన్‌చార్జ్ డీఈవోగా బాధ్యతలు నిర్వహించారు. అదేవిదంగా కాకినాడ జిల్లా పిఠాపురం డీవైఈవోగా బాధ్యతలు నిర్వహిస్తున్న దాట్ల సుభద్రకు పదోన్నతి కల్పించి ప్రకాశం జిల్లా డీఈవోగా బదిలీచేశారు.

ఉపాధ్యాయులకు 3న ప్యాట్ పరీక్ష : ఆర్జేడీ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 6: జిల్లాలో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ టెస్ట్ (ప్యాట్)కు దరఖాస్తుచేసిన ఉపాధ్యాయులందరికీ మార్చి 3న పరీక్ష నిర్వహించనున్నామని ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్ కోసం సంబంధిత వెబ్‌సైట్ www.bse.ap.gov.in లో తీసుకుని హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు కాకినాడ డీఈవో కార్యాలయంలో సంప్రదించాలని ఆర్జేడీ సూచించారు.

కాకినాడ జేఎన్టీయూకు ఏపీఈఏపీసెట్ నిర్వహణ బాధ్యతలు

చైర్మన్‌గా వ్యవహరించనున్న ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 6: రాష్ట్రవ్యాప్తంగా ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహించే ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ప్రవేశ పరీక్ష (ఏపీఈఏపీసెట్) 2024 నిర్వహణ బాధ్యతలను కాకినాడ జేఎన్టీయూకు అప్పగించినట్లు ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం జేఎన్టీయూకే వరుసగా 7సార్లు ఏపీఈఏపిసెట్ ప్రవేశ పరీక్షను విజయవంతంగా నిర్వహించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఈ పరీక్షలను ఎటువంటి అవరోధాలకు తావు లేకుండా షెడ్యూల్ ప్రకారం నిర్వహించేందుకు తగినచర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు దీనికి చైర్మన్‌గా వ్యవహరించనున్నారని రిజిస్ట్రార్ సుమలత తెలిపారు. ఏపీఈఏపీసెట్ నిర్వహణ బాధ్యతలను అప్పగించడంపట్ల రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యనారాయణ, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ కె. హేమచంద్రారెడ్డిలకు వీసీ కృతజ్ఞతలు తెలిపారు.

గతంలో ఇలా...

జేఎన్టీయూకే ఆధ్వర్యంలో 2015, 16,17,18,19 సంవత్సరాలలో నిర్వహించిన ఏపీఈఏపిసెట్‌లకు ప్రొఫెసర్ సీహెచ్‌సాయిబాబు కన్వీనర్‌గా వ్యవహరించగా 2015,16లలో ఆఫ్‌లైన్‌లోనూ, 2017,18,19లలో ఆన్‌లైన్‌లోనూ నిర్వహించారు. అదేవిధంగా 2020,21 సంవత్సరాలలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఏపీఈఏపిసెట్ ప్రవేశపరీక్షకు ప్రొఫెసర్ వి. రవీంద్ర కన్వీనర్‌గా వ్యవహరించారు. కాగా జేఎన్టీయూకేలో గతంలో పలు ప్రవేశ పరీక్షలను విజయవంతంగా నిర్వహించిన ప్రావీణ్యం కలిగిన సీనియర్ ప్రొఫెసర్లను కాదని అనుభవంలేని వ్యక్తిని కన్వీనర్‌గా నియమిస్తున్నారన్న సమాచారంతో వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది.



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్

జనసేన నాయకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

జిల్లా ఎస్పీకి జనసేన నేతల వినతిపత్రం

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 6: పిఠాపురం జనసేన పార్టీ సీనియర్ నాయకుడు మాదేపల్లి శ్రీనివాసరావుపై హత్యాయత్నానికి ప్రయత్నించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో పిఠాపురం ఇన్‌చార్జి తంగెళ్ల శ్రీనివాస్, పీఏసీ సభ్యులు పంతం నానాజీ, ముత్తా శశిధర్, వరుపుల తమ్మయ్యబాబులతో కలసి కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌ని కలుసుకుని ఫిర్యాదు అందజేశారు. ఈసందర్భంగా దుర్గేష్, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ శ్రీనివాసరావుపై పిఠాపురం జనసేన కార్యాలయం వీధిలో కత్తితో పలుమార్లు రెక్కీ నిర్వహించారన్నారు. ప్రశాంతతకు మారుపేరైన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇటువంటి హత్యా రాజకీయాలకు ప్రయత్నించడం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి, ఎవరి ప్రమేయం ఉందో దర్యాప్తు చేయాలన్నారు. నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకోవాలని కోరారు. విచారణ నిర్వహించి దాడికి ప్రయత్నించిన వారిని అదుపులోకి తీసుకుంటామని ఎస్పీ చెప్పారు.

370 కిలోల గంజాయి స్వాధీనం

8లో



పిఠాపురం పోలీసుస్టేషన్ వద్ద మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అశోక్‌కుమార్

వారే పలకరించి అన్యాయంగా కేసులు పెట్టారు

మలుపులు తిరుగుతున్న జనసేన నేతపై దాడి కేసు

పిఠాపురం, ఫిబ్రవరి 6: పట్టణంలోని జనసేన కార్యాలయం వద్ద ఆ పార్టీ నేత మాదేపల్లి శ్రీనివాసరావుపై కత్తితో దాడి చేసేందుకు నలుగురు యువకులు ప్రయత్నించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేయడం, తదనంతరం జరిగిన సంఘటనలతో కేసు పలు మలుపులు తిరుగుతోంది. ఈ సంఘటనలో అనుమానితులుగా ఉన్న నలుగురు దళిత యువకుల ను పోలీసులు మంగళవారం ప్రశ్నించారు. ఈ సంఘటనలో తమ కుమారులను అన్యాయంగా ఇరికించారని దళిత యువకుల తల్లులు మానుకొండ లక్ష్మి, పి.రత్నకుమారి, ఎస్.మాణిక్యంలు ఆవేదన వ్యక్తంచేశారు. వారు పిఠాపురం పోలీసుస్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ తమ కుమారులు జనసేన అభిమానులని వారు తెలిపారు. తమ కుమారుల బతుకులతో ఆడుకోవద్దని, రాజకీయాల్లో ఇరికించి వారి భవిష్యత్తును పాడు చేయవద్దని వారు హితవు పలికారు. కాగా జనసేన నేతపై దాడికి ప్రయత్నం జరిగినట్టు వచ్చిన ఫిర్యాదులో దళిత యువకులను కక్ష కట్టి ఇరికించారని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ ఆరోపించారు. ఇందిరానగర్‌కు చెందిన నలుగురు యువకులు చెట్లు నరికేందుకు కత్తులు పట్టుకుని వెళుతుంటే వీరే హత్యాయత్నానికి పాల్పడ్డారని జనసేన నాయకులు సీసీ ఫుటేజీ తెచ్చి ఇవ్వడం దారుణమన్నారు. కూలీ పనులు చేసుకునే వారు ఇటువంటి సంఘటనలకు పాల్పడరని తెలిపారు. రాజకీయాలు కోసం దళిత యువతను బలితీసుకోవాలని చూస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

పోలీసుల విచారణ

తనపై కత్తితో దాడికి యువకుల ప్రయత్నించారంటూ జనసేన నేత మాదేపల్లి శ్రీనివాసరావు చేసిన ఫిర్యాదుపై పిఠాపురం పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. జనసేన నాయకులు ఇచ్చిన సీసీ ఫుటేజీ ఆధారంగా అందులో ఉన్న నలుగురు యువకులతో పట్టణ ఎస్ఐ మురళీమోహన్ తదితరులు మాట్లాడి సంఘటన వివరాలు సేకరించారు. దళిత సంఘాలు పోలీసుస్టేషన్ వద్ద ఆందోళనకు దిగుతాయన్న సమాచారంతో నలుగురు యువకులను పోలీసులు పంపివేశారు. బుధవారం ఈ ఘటన వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.



పవన్‌కల్యాణ్‌ను కలిసిన సానా సతీష్

జనసేన-టీడీపీ ఉమ్మడి ఎంపీ అభ్యర్థిగా ఖరారవడంతో భేటీ

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 6 : జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం సానా సతీష్ కలిసారు. జనసేన-టీడీపీ కాకినాడ పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థిగా సానా సతీష్ అభ్యర్థిత్వం ఖరారుకావడంతో ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. వీరి భేటీలో జిల్లాలో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పరిస్థితులపై చర్చించుకున్నారు. త్వరలో పార్లమెంట్ పరిధిలో ప్రచారం మొదలుపెట్టే అంశంపై చర్చించుకున్నారు. టీడీపీ, జనసేన కలిసి కాకినాడ పార్లమెంట్ పరిధిలో మొత్తం అన్ని స్థానాలు కైవసం చేసుకునే దిశగా కార్యాచరణ చేపట్టే అంశంపై సతీష్‌కు పవన్ దిశానిర్దేశం చేశారు. కాగా వైసీపీ కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా చలమలశెట్టి సునీల్‌ను ఆ పార్టీ ఖరారు చేసింది. దీంతో సానా సతీష్‌ను కలవాలని జనసేన కేంద్ర కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. జనసేన తరఫున సానా సతీష్ రంగంలోకి దిగనున్నారు.

రైతు బజార్లలో నిలకడ..
బహిరంగ మార్కెట్‌లో బాదుడు

- తేడాలు గమనించి విస్తుపోతున్న సామాన్యులు
- బెండ ధర పైపైకి.. మార్కెట్‌లో వెల్లుల్లి కిలో రూ.400





రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 6: కూరగాయల ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. బెండ ధర మినహా మిగిలిన వారి ధరలు పర్వాలేదనిపిస్తున్నాయి. అయితే ఇదంతా రైతు బజార్లలోనే..బహిరంగ మార్కెట్‌లో బాదుడు మామూలే.. వాస్తవానికి కొద్దిరోజులుగా కూరగాయల ధరల్లో నిలకడ కొనసాగుతోంది. గత నవంబరు, డిసెంబరులో కురిసిన వర్షాలకు కడియం, కడియపుసావరం, సీతానగరం, కూనవరం తదితర ప్రాంతాల్లో కూరగాయల పంటలు, పాదులు కుళ్లిపోయాయి. పంటలన్నీ పాడై పోవడంతో అన్ని రకాల కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయి. ఏం కొనాలి, ఏం తినాలి అన్నట్టుగా సామాన్యులు, మధ్యతరగతి ప్రజల పరిస్థితి తయారైంది. ఆ తర్వాత కూరగాయలు సాగు చేసే రైతులు మళ్లీ నారు పోసి సాగు మొదలెట్టడంతో ఇప్పుడు అన్ని రకాల కూరగాయలు పుష్కలంగా దొరుకుతున్నాయి. అయితే, ధరల తగ్గుదల ప్రయోజనం రైతుబజార్లలో మాత్రమే దొరుకుతోంది. బహిరంగ మార్కెట్లలో ఎప్పటిలానే ధరల దోపిడీ కొనసాగడం గమనార్హం. రైతుబజార్లలోని రేట్ల కంటే రెట్టింపు ధరలకు బహిరంగ మార్కెట్లలో విక్రయాలు సాగుతున్నాయి. ఎప్పుడూ హై రేటు పలికే దొమ్మేరు వంకాయలు రైతు బజార్లలో కిలో రూ.32కే దొరకడం విశేషం. అలాగే రూ.100పైనే ఉండే చిక్కుడు కాయలు రూ.26, 38కే దొరుకుతున్నాయి. ఒక్క బెండకాయ ధర మాత్రం మెండుగా ఉంది. బెండకాయల ధర మాత్రం కిలో రూ.44 ఉంది. స్థానికంగా బెండకాయల దిగుబడులు అందుకోకపోవడం, ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి రావడంతో వీటి ధరలు కాస్త ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు.

బహిరంగ మార్కెట్లలో బాదుడే ..


రైతు బజార్లలో కూరగాయల ధరలు ఎంత తగ్గినా బహిరంగ మార్కెట్లలో మాత్రం బాదుడు కొనసాగుతోంది. రైతు బజార్లలోని రైతులు కొందరు కొన్ని రకాల పంటలు సాగు చేస్తుంటారు. ప్రధానంగా టమోట, కొన్ని రకాల వంకాయలు, బెండ, బీర, దొండ వంటివి పండిస్తారు. మరికొంతమంది అరటికాయలు, కాలీఫ్లవర్, పొట్లకాయలు, ఆనబకాయలు వంటివి సాగు చేస్తారు. కానీ, మార్కెట్ అవసరాలకు ఇవి ఏమాత్రం సరిపడవు. దీంతో వీళ్లు కూడా హోల్‌సేల్ మార్కెట్లను ఆశ్రయిస్తారు. రాజమహేంద్రవరంలో ప్రధానమైన రంభ-ఊర్వశి కూరగాయల మార్కెట్, రావులపాలెం సమీపంలోని మడికి, దొమ్మేరు వంటి మార్కెట్ల నుంచి బహిరంగ మార్కెట్లలోని వ్యాపారులు, రైతుబజార్లలోని రైతులు సరుకు తెచ్చుకుంటారు. కానీ, ధరల్లో మాత్రం రైతుబజార్లకు, బహిరంగ మార్కెట్లకు రెట్టింపు వ్యత్యాసం ఉంటోంది. దీంతో బహిరంగ మార్కెట్లు, చిల్లర మార్కెట్లలో కొనుగోలు చేసే పేదలు, సామాన్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉదాహరణకు రైతు బజార్లలో కిలో బెండకాయలు రూ.44గా ఉంది. ఇక్కడ ఇదే అత్యధిక ధర అనుకుంటే, బహిరంగ మార్కెట్లో మాత్రం బెండకాయల ధర రూ.80 వరకూ ఉంది. అలాగే, ఇతర కూరగాయల ధరలు రెట్టింపు పలుకుతున్నాయి. మార్కెట్లో ధరల పెరుగుదలను నియంత్రించాల్సిన మార్కెటింగ్ శాఖ, ఇతర అధికార వ్యవస్థలు ఈ విషయాన్ని పట్టించుకోకపోవడంతో తాము దోపిడీకి గురవుతున్నామనే భావన సామాన్యులు, మధ్యతరగతి ప్రజానీకంలో వ్యక్తమవుతోంది.

కన్నీళ్లు పెట్టిస్తున్న వెల్లుల్లి

వెల్లుల్లి ధర కన్నీళ్లు పెట్టిస్తోంది. వందా రెండొందలు కాదు ఏకంగా రూ.400కు పెరిగిపోయింది. పావుకిలో పాయలు కావాలంటే రూ.100 రూపాయలు ఇవ్వాల్సిందే.. వంటకాల్లో వెల్లుల్లి వేయడం అనేది సర్వసాధారణం. అలాంటిది ఇప్పుడు దాని ధర అమాంతం పెరగడంతో ఏం చేయాలో సామాన్యులకు తోచడం లేదు. వంద రూపాయలు పెట్టి పావు కిలో కొన్నా రెండు రోజులు, మూడు రోజులకు మించి రావు. దీంతో చాలా మంది తమ వంటకాల్లో వెల్లుల్లిని మినహాయిస్తున్నారు. దిగుమతుల ప్రభావంతో ధర పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.



రేపు బ్రహ్మసమేధ్యం తీర్థం



కాట్రేనికోన, ఫిబ్రవరి 6: కాట్రేనికోన మండలం పల్లం గ్రామ శివారు సముద్రతీరాన బ్రహ్మసమేధ్యం ఉంది. ప్రతి ఏటా చొల్లంగి అమావాస్య రోజున ఇక్కడ తీర్థం జరుగుతుంది. చొల్లంగి రోజున సముద్ర స్నానాల కోసం జిల్లా వ్యాప్తంగా పలువురు ఇక్కడికి తరలి రావడం ఆనవాయితీ. ఈ నెల 8న బ్రహ్మసమేధ్యంలో చొల్లంగి తీర్థానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ఆ రోజు తెల్లవారుజామున సముద్ర గర్భం నుంచి వచ్చే సూర్యోదయాన్ని తిలకించేందుకు భక్తులు వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు. సూర్యోదయ సుందర దృశ్యాన్ని వీక్షించిన అనంతరం సముద్రంలో స్నానమాచరిస్తారు. బ్రహ్మసమేధ్యంలో కాలభైరవస్వామి కొలువు తీరి ఉన్నాడు. ఈ ప్రదేశంలో ఆయన పాద ముద్రలు పురాణాలకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. వీటిలో శంఖచక్రాలు, వింజామరలు నేటికీ కనిపించడం ఈ క్షేత్ర ప్రసిద్ధికి తార్కాణం. చొల్లంగి అమావాస్య రోజున ఈ ఆలయ ఆవరణలో సంతానం లేని స్త్రీలు స్వామిని ఆరాధించి నిద్రిస్తే కలిగే స్వప్నంలో అరటి పండ్లు, కొబ్బరికాయలు, గుమ్మడి కాయలు కన్పిస్తే సంతానం కలుగుతుందని నమ్మకం. అమలాపురం డీఎస్పీ మహేశ్వరరావు ఆధ్వర్యంలో ముమ్మిడివరం సీఐ కొండయ్య, ఎస్ఐ నాగేశ్వరరావు తీర్థంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

11న వేమగిరిలో
దళిత గర్జన సభ



సమావేశంలో మాట్లాడుతున్న జీవీ శ్రీరాజ్

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఫిబ్రవరి 6: దళితులను అన్నివిధాల మోసం చేసిన సీఎం జగన్‌కు ఈనెల 11న వేమగిరిలో నిర్వహించే దళిత సింహగర్జన సభ కనువిప్పు కలిగించబోతుందని అమలాపురం మాజీ ఎంపీ జీవి హర్షకుమార్ తనయుడు జీవీ శ్రీరాజ్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో వెనుకబడిన దళిత జాతులకు మేలు చేస్తారని వైసీపీ ప్రభుత్వాన్ని గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక జగన్ పూర్తిగా దళితులను నిర్లక్ష్యం చేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి సబ్‌ప్లాన్ నిధులను నవరత్నాల పేరుతో దారి మళ్లించారని, మాల, మాదిగ, రెల్లి కార్పొరేషన్ అంటూ దళితులను విభజించి రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించారన్నారు. ఇప్పటికైన దళిత జాతి వర్గాలు మేల్కొని తమ నిరసన గళం వినిపించాలని శ్రీరాజ్ పేర్కొన్నారు. హర్షకుమార్ నేతృత్వంలో వేమగిరిలో జరిగే దళిత గర్జన సభలో దళితులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. దళిత నాయకులు వరిగేటి కిరణ్, కొమ్ము ప్రభాకర్‌రావు, తెనాలి కిరణ్, ఇందుగుమిల్లి చిరంజీవి, పసలపూడి పాపారావు, పౌరోజు మాణిక్యాలరావు, తాతపూడి సత్యనారాయణ, ఫౌరోజు చిరంజీవి పాల్గొన్నారు.

ఏజెన్సీలో చికెన్‌సెల్ గుర్తించేందుకు
నమూనాల సేకరణ



సమీక్ష నిర్వహిస్తున్న సూరజ్ గనోరే

రంపచోడవరం, ఫిబ్రవరి 6: ఏజెన్సీలో చికెన్ సెల్ వ్యాధి ఉన్నవారిని గుర్తించేందుకు రక్త నమూనాలను స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు.ఐటీడీఏ కార్యాలయం సమావేశపు హాలు నుంచి మంగళవారం ఆయన వైద్యాధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ ప్రతి గ్రామం, పాఠశాలల్లో చికెన్ సెల్ పరీక్షలు నిర్వహించేందుకు 79,425 కిట్లు వచ్చాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చికెన్ సెల్ బాధితులకు పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో జి.ప్రకాశం, వైద్యాధికారులు రాధిక, కెల్విన్, సాహిని, ఎంపీహెచ్‌వో పీటర్, జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, ఏపీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల యాత్ర

9న కొవ్వూరులో రచ్చబండ.. అదేరోజు సాయంత్రం తునిలో రోడ్ షో



మాట్లాడుతున్న పీసీసీ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పద్మశ్రీ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 6: పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఈనెల 7నుంచి రాష్ట్రంలో యాత్ర చేపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ తెలిపారు. రాజమహేంద్రవరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 7న బాపట్ల నుంచి యాత్ర ప్రారంభిస్తారని, ఈ యాత్ర ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో రూరల్ ప్రాంతాల మీదుగా సాగుతుందన్నారు. 8న సాయంత్రం ఏలూరు జిల్లా దెందులూరుకు చేరుకుని రోడ్ షో నిర్వహిస్తారని, అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభలో పాల్గొంటారని చెప్పారు. 9న ఉదయం కొవ్వూరు చేరుకుని అక్కడ రచ్చబండ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. బడుగు బలహీనవర్గాల సమస్యలపై చర్చిస్తారని చెప్పారు. అనంతరం అదే రోజు సాయంత్రం కాకినాడ జిల్లా తునిలో రోడ్‌షో నిర్వహించి బహిరంగ సభలో పాల్గొంటారన్నారు. ఈ యాత్రలో షర్మిళారెడ్డి వెంట సీడబ్ల్యూసీ సభ్యులు రఘువీరారెడ్డి, పల్లంరాజు, రుద్రరాజు, కేవీపీ రామచంద్రరావు తదితర ముఖ్య నేతలు ఉంటారని చెప్పారు. షర్మిళారెడ్డి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు కావడం తట్టులోక ఓటమి భయంతో గజదొంగలు ఏ1 జగన్, ఏ2 విజయసాయిరెడ్డి దొంగల ముఠా తప్పుడు ఆరోపణలు చేస్తోందని పద్మశ్రీ మండిపడ్డారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాలు, 25 ఎంపీ స్థానాల్లోను కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తుందని పద్మశ్రీ స్పష్టం చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, పీసీసీ ప్రధాన కార్యదర్శులు బోడా వెంకట్, ముళ్ళ మాధవ్, పెదిరెడ్డి సుబ్బారావు, తాళ్ళూరి విజయకుమార్, చిన్నం మురళీకృష్ణ, వైఏ వడయార్, గడ్డం సాయిబాబా, మహ్మద్ అమర్జహ బేగం, మార్టిన్ లూథర్ పాల్గొన్నారు.

చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రతో సమగ్ర అధ్యయనం



సమావేశంలో మాట్లాడుతున్న సబ్బతి ఫణీశ్వరరావు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 6: చంద్రన్న కార్మిక చైతన్య బస్సుయాత్ర ద్వారా రాష్ట్రంలో ఉద్యోగ, కార్మిక, భవన నిర్మాణరంగ కార్మికుల సమస్యలను అధ్యయనం చేసి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుకు నివేదించనున్నట్లు టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు చెప్పారు. బస్సు యాత్ర ముగింపు సందర్భంగా ముమ్మిడివరంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు స్వగృహం వద్ద మంగళవారం జరిగిన సమావేశంలో ఫణీశ్వరరావు మాట్లాడుతూ జనవరి 6వ తేదీన శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం నుంచి ప్రారంభమైన బస్సుయాత్ర ఈ నెల 4న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంతో ముగిసిందన్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు ఆధ్వర్యంలో 3347 కిలోమీటర్లు మేర బస్సు యాత్ర సాగిందని, ఈ బస్సు యాత్ర ద్వారా రాష్ట్రంలోని అన్ని రంగాల్లోను ఉద్యోగులు, కార్మికుల సమస్యలను గుర్తించామన్నారు. 2024 ఎన్నికల్లో టీఎన్‌టీయూసీకి ఒక ఎమ్మెల్యే సీటు కేటాయించాలని రాష్ట్ర నాయకత్వం ప్రతిపాదించి టీడీపీ అధిష్ఠానానికి నివేదించినట్లు చెప్పారు. టీఎన్‌టీయూసీ తరపున అభ్యర్థిగా తన పేరును సూచించినట్టు కూడా ఫణీశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఫణీశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు కుసుమ సూర్యమోహనరావు, యర్రమోతు ధర్మరాజు, అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు, నక్కా రామకృష్ణ, ముమ్మిడివరం ప్రధాన కార్యదర్శి బూరగ శ్రీనివాస్ కల్యాణ్, నాయకులు గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, మెండి కమల, యాళ్ల ఉదయ్, సబ్బతి రాంబాబు, గెడ్డం శ్రీనివాసరావు, పాయసం చిన్నీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

రైతుల నుంచే పరిశోధనలు మొదలవ్వాలి



రైతులకు బదనికలు అందిస్తున్న సుశీల్

అంబాజీపేట, ఫిబ్రవరి 6: రైతుల భాగస్వామ్యంతో వ్యవసాయ ఉద్యాన పరిశోధనలు, ప్రయోగాలు జరగాల్సి ఉందని అఖిల భారత జీవ నియంత్రణ సమన్వయ పథకం డైరెక్టర్ అండ్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్ఎస్ సుశీల్ అభిప్రాయపడ్డారు. అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పరిశోధన కేంద్రంలో జరుగుతున్న పరిశోధనలు రైతులకు ఎప్పటికప్పుడు తెలియచేయాలన్నారు. జీవ నియంత్రణ బదనికలను ఉపయోగించడం వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధించవచ్చునన్నారు. స్థానిక పరిశోధన కేంద్రంలో జీవ నియంత్రణ ప్రయోగశాలలు, పరిశోధనలు పరిశీలించారు. బదనికల తయారీ, వినియోగం గురించి పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు సుశీల్‌కు వివరించారు. ఈ సందర్భంగా స్థానిక పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న బదనికలు, జీవనియంత్రణ శిలింధ్ర నాశినలను రైతులకు సుశీల్ అందించారు. అనంతరం గోదావరి ఇంటిగ్రేటెడ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ చైర్మన్ కొవ్వూరి త్రినాథ్‌రెడ్డి, వైఎస్సార్ యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు పరిశోధన కేంద్రంలో సుశీల్‌ను కలిశారు. గిఫ్ట్ కంపెనీ ఎఫ్‌పీవో ద్వారా బయలాజి కల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసి రూగోస్ నివారణకు బదనికలు తయారు చేయనున్నట్లు వివరించారు. రైతు ఉత్పత్తిదారు సంస్థ ద్వారా బదనికలు తయారు చేసే తొలి బయలాజికల్ ల్యాబ్ ఇదేనన్నారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి డాక్టర్ జి.శివకుమార్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.శ్రీదేవి, కొవ్వూరు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ జి.రామానందం, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష, ఎ.కిరీటి పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు
పరిష్కారం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న గంధం సునీత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యే విధంగా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత ఆదేశించారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కారం పొందే అర్హత ఉన్న సమస్యలను గుర్తించి సదరు జాబితాను జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. లోక్ అదాలత్‌లో ఇరుపక్షాల వారూ రాజీ మార్గం ద్వారా అంగీకారయోగ్యమైన పరిష్కారాన్ని సత్వరమే పొందవచ్చన్నారు. సమావేశంలో మునిసిపల్, కార్మిక, విద్యుత్, టెలికాం, బ్యాంకింగ్, ఏపీ ఫైనాన్స్ కార్పొరేషన్, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్‌ఫండ్స్ శాఖల అధికారులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

డీహెచ్‌పీఎస్ డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) డైరీని కోర్టు ఆవరణలో ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీవీటీ రాజు, ప్రధాన కార్యదర్శి కవి హనుమంతరావు, న్యాయవాదులు సురేశ్, కె.సోమశేఖర్, ఎస్.లక్ష్మణరావు, సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక వివక్షను రూపుమాపడానికి సాగుతున్న ఉద్యమాలకు కరదీపికగా ఈ డైరీ ఉపయోగపడుతుందని ప్రశంసించారు. దేశంలో అన్ని వర్గాల వారూ కలిసిమెలిసి ఉంటే దేశం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. పేదల కోసం పోరాడే కమ్యూనిస్టులు, దళిత సంఘాలు.. 'లాల్ నీల్' ఏకమై పోరాడినప్పుడే దళిత హక్కుల పరిరక్షణ జరుగుతుందని అన్నారు.

ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీ

తుని రూరల్, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా తుని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో డీజిల్ చోరీకి గురైంది. తుని నుంచి రౌతులపూడికి స్కూల్ పిల్లలతో వెళ్లిన ఏపీ 29జెడ్ 0490 ఆర్టీసీ బస్సు రౌతులపూడిలో పోలీస్‌స్టేషన్ దగ్గరలో పార్కింగ్ చేసి ఉంచగా గుర్తు తెలియని వ్యక్తులు ఆయిల్ ట్యాంకర్ తాళం పగలకొట్టి సుమారు 250 లీటర్ల డీజిల్ చోరీకి పాల్పడ్డారు. అయితే చోరీకి గురైన డీజిల్‌ను బస్సు డ్రైవర్‌ను నుంచి రికవరీ చేసి విషయాన్ని గోప్యంగా ఉంచేందుకు డిపో అధికారులు పూనుకున్నట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా పార్కింగ్ చేసిన వాహనాల్లో ఇంధనం మాయమవడం, వాహనాల బ్యాటరీలు చోరీకి గురవడం పరిపాటిగా మారిందని పలువురు అంటున్నారు.

ఆర్టీసీ బస్సు దిగుతూ కిందపడి వ్యక్తి మృతి

కొత్తపల్లి/జీజీహెచ్,ఫిబ్రవరి 6: ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్ దిగుతూ జారి పడిన సంఘటనలో వృద్ధుడు మృతి చెందాడు. ఉప్పాడకు చెందిన రెడ్నం సత్యనారాయణ(73) కిరాణా వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. మంగళవారం మధ్యాహ్నం వ్యాపారం నిమిత్తం సరుకుల కొనుగోలుకు కాకినాడ వెళ్లి ఉప్పాడ తిరుగు ప్రయాణమ య్యారు. ఉప్పాడలో బస్ దిగుతూ జారిపడి తీవ్రగాయాలపాలయ్యారు. వెంటనే అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తరలించే క్రమంలో సత్యనారాయణ మార్గ మధ్యంలో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

370 కిలోల గంజాయి స్వాధీనం



నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

జగ్గంపేట, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని రామవరం జాతీయ రహదారిని ఆనుకున్న హర్యానా రాజస్థాన్ దాబా హోటల్ వద్ద ఒక కంటైనర్ లారీలో ప్రత్యేక అరలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని జగ్గంపేట సీఐ లక్ష్మణరావు స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం... హరియాణాకు చెందిన ఇబ్రహీం, జున్‌దలు ఒడిసాలోని చిత్రకొండ గ్రామంలో మోటూ అనే వ్యక్తి వద్ద 370 కిలోల గంజాయిని కొనుగోలు చేసి తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు సీఐ తెలిపారు. మోటు ఈ గంజాయిని ముందు రోజు గండేపల్లి మండలం మురారి గ్రామంలోని పోలవరం కెనాల్ వద్ద తీసుకువచ్చి తుప్పల్లో దాచి ఇద్దరు వ్యక్తులకు సరుకు అప్పగించారన్నారు. ఇబ్రహీం, జున్‌దలు మహారాష్ట్రకు చెందిన సీక్రెట్ అరతో కూడిన కంటైన్ లారీలో ఈ గంజాయి నింపుకుని తరలిస్తుండగా మార్గం మధ్యలో లారీ మరమ్మత్తులకు గురవడంతో రామవరం దాబా వద్ద రిపేరు చేయిస్తుండగా జగ్గంపేట ఎస్ఐ నాగార్జునరాజు సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని 370 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. మోటూ పరారీలో ఉన్నాడని త్వరలో అతన్ని అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

18న రికార్డు అసిస్టెంట్లకు పరీక్ష

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కరోనా విపత్తు కారణంగా నోటిఫికేషన్ నెం.1/2019కి సంబంధించి వాయిదా పడిన రెండు రికార్డు అసిస్టెంట్ పోస్టులకు రాత పరీక్షను ఈ నెల 18న నిర్వహిస్తున్నామని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత తెలిపారు. గోకవరం బస్టాండ్ సమీపంలోని రాజమహేంద్రి డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. ఈ పరీక్ష కోసం షార్ట్ చేసిన జాబితాలో ఉన్న అభ్యర్థులకు రిజిస్టరు పోస్టు ద్వారా హాల్ టికెట్లు పంపించామని, అయితే ఆ చిరునామాలో లేకపోవడంతో కొన్ని వెనక్కు తిరిగి వస్తున్నాయన్నారు. అలాంటి వారు రాజమహేంద్రవరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

కోతి దాడిలో పలువురికి గాయాలు



గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో కోతి(అలంబండ) పలువురిపై దాడి చేసి విచక్షణారహితంగా కరవడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన చేదులూరి సత్యవేణికి తీవ్రంగా గాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని స్థానికంగా ఉన్న ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. గొల్లప్రోలు జడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల నాగలోవరాజు విషయాన్ని కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆమె అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. బవురువాక, అగ్రహారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు వై.బాబూరావు, పి.లావణ్య తదితరులు బాధితులను పరామర్శించారు. కోతుల కోసం గాలింపు చేపట్టారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌కు ఏడాది జైలు

గొల్లప్రోలు రూరల్, ఫిబ్రవరి 6: కాకినాడ జిల్లా గొల్లప్రోలు పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదానికి కారణమైన టాక్సీ డ్రైవర్‌కు ఏడాది జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ పిఠాపురం అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.లీలాసాయిసుభాష్ తీర్పు చెప్పారు. శంఖవరం మండలం కత్తిపూడికి చెందిన సలపరెడ్డి పాండురంగారావు(38) ఒక మహిళతో మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, గొల్లప్రోలు మండలం కొత్త వజ్రకూటం వద్ద రాజమహేంద్రవరం నుంచి కత్తిపూడి వెళుతున్న కారు ఢీకొట్టింది. ప్రమాదంలో పాండురంగారావుతో పాటు గుర్తు తెలియని మహిళ మరణించారు. 2018 ఏప్రిల్ 3న సంఘటన జరగగా అప్పటి ఎస్ఐ కేసు నమోదు చేసి ప్రమాదానికి కారణమయిన విశాఖ జిల్లా గోపాలపట్నానికి చెందిన కారు డ్రైవర్ సలపు సత్తిబాబును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు అనంతరం నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ ఆకుల నాగలీలా రోజా ప్రాసిక్యూషన్ నిర్వహించగా, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ బాలాజీ, కోర్టు కానిస్టేబుల్ వై.రాజాబాబులు సాక్షులను హాజరు పరచడంలో సహకరించారు.

కాకినాడ

'ఛలో హైకోర్టు ఆందోళనకు తరలిరావాలి'

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన టైటిలింగ్ చట్టాన్ని నిరసిస్తూ బుధవారం అమరావతిలో నిర్వహించే ఛలో హైకోర్టు ఆందోళనకు న్యాయవాదులు తరలిరావాలని ఐలాజ్ ప్రతినిధులు బుగతా శివ, అవసరాల దేవి కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర న్యాయవాద జేఏసీ పిలుపు మేరకు టైటిలింగ్ చట్టం రద్దు చేసేంతవరకు న్యాయవాదుల ఆందోళనకు ఐలాజ్ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు.



ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించిన ఎంఈవో

'ఓటుతో ప్రజాస్వామ్య పరిరక్షణ'

వేములవాడ (కరప), ఫిబ్రవరి 6: ఓటు అనే ఆయుధంతో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని ఎంఈవో పత్తి సత్యనారాయణ పిలుపునిచ్చారు. వేములవాడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా నిజమైన ప్రజాసేవ చేసేవారిని ఎన్నుకోవాలన్నారు. ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఎం ఎస్.శ్రీనివాస్, సీఆర్పీ పి.రాజు తదితరులున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ

పిఠాపురం, ఫిబ్రవరి 6: ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో విలువ ఉందని, మనను పాలించే ప్రభుత్వాలు, పాలకులను ఎన్నుకునే హక్కు ఓటర్లకే ఉందని పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురంలోని ఆర్ఆర్పార్కులో మంగళవారం సాయంత్రం ఎన్నికల నియమావళి, ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పిఠాపురం పట్టణ ఎస్ఐ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాధనం దోపిడియే వైసీపీ లక్ష్యం'

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 6: వైసీపీ ప్రభుత్వం ప్రజాధనం దోపిడీయే లక్ష్యంగా చేసకుందని, పాలనను గాలికి వదిలేశారని జనసేన పీఏసీ సభ్యుడు, సిటీ ఇన్చార్జి ముత్తా శశిధర్ విమర్శించారు. ఆయన నాయకత్వంలో మత్స్యకార యువత భవిష్యత్ కోసం యుద్ధానికి మేము సిద్ధం కార్యక్రమాన్ని మంగళవారం 15వ డివిజన్ ఏటిమొగ ప్రాంతంలో చేపట్టారు. శశిధర్ మాట్లాడుతూ స్మార్ట్సిటీ నిధులతో తలపెట్టిన పనుల్లో పర్సంటేజీలో చూశారు కాని పనులు ఎంతవరకు పూర్తయ్యాయో కూడా పట్టించుకోలేదన్నారు. ఇక్కడ ఉన్న యువతకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే 40రోజుల తరువాత జరిగే ఎన్నికల్లో ఈ ముఖ్యమంత్రి జగన్ని, వైసీపీని దించేందుకు మేము సిద్ధం అని స్థానికులతో కలిసి నినదించారు. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, పంతాడి సింహాద్రి, ఎ.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సీడీఎంఏను కలిసిన కమిషనర్స్ అసోసియేషన్



సీడీఎంఏకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యులు

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 6: కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ)గా నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి శ్రీకేష్ బి.లత్కర్ను ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్స్కు సంబంధించిన పలు అంశాలను సీడీఎంఏ దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. సీడీఎంఏను కలిసినవారిలో మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, అడిషనల్ డైరెక్టర్ శివపార్వతి, అధ్యక్షుడు, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు, ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, కోశాధికారి శివారెడ్డి, ఉపాధ్యక్షులు భవానీ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఏసుబాబు, పలువురు సంయుక్త కార్యదర్శులు ఉన్నారు.

ఆసరా పథకం నిధుల అందజేత

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 6: ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలో 516 డ్వాక్రా సంఘాలకు 4980 మంది సభ్యులకు నాల్గో విడత ఆసరా పథకం కింద రూ.4.49కోట్లు నిధులను మంగళవారం నగర పంచాయతీ కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, చైర్పర్సన్ అలమండ సత్యవతి డ్వాక్రా సభ్యులకు అందజేశారు. నగర పంచాయతీలోని 4విడదల ఆసరా పథకంలో 516 సంఘాలకు రూ.17.64కోట్లు పంపిణీ చేసినట్లు మెప్మా అధికారులు తెలిపారు. కమిషనర్ కె.శివప్రసాద్, వైస్ చైర్మన్లు చిడగం త్రివేణి, ఎం.బుజ్జి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, సామంతుల హైమావతి, దో కిషోర్బాబు, మాజీ జడ్పీటీసీ చిడగం వెంకటేశ్వరరావు,వీర్రాజు పాల్గొన్నారు.

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామంలో ఆసరా నాల్గో విడత కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు మహిళా స్వయం సహాయక సంఘాలకు చెక్కులను అందచేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఎంపీపీ పెంకే సత్యవతి, జడ్పీటీసీ గవరసాన సూరిబాబు పాల్గొన్నారు.

రైలులో గుర్తు తెలియని మృతదేహం



కాకినాడ క్రైం ఫిబ్రవరి 6: రైలులో ఓ గుర్తు తెలియని మృతదేహాన్ని కాకినాడ జీఆర్పీ పోలీసులు మంగళవారం గుర్తించారు. వివరాలిలా ఉన్నాయి. బెంగుళూర్ నుంచి కాకినాడ చేరిన శేషాద్రి ఎక్స్ప్రెస్ ఎస్ 10 బోగిని మంగళవారం సిబ్బంది శుభ్రపరుస్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం వారు జీఆర్పీ పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ ఎన్.రవికుమార్ సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50 ఏళ్ళు ఉండచ్చని, నలుపు తెలుపు చారల ప్యాంట్, గళ్ళ చొక్క ఉన్నట్టు తెలిపారు. గుండె పోటు లేదా అనారోగ్యం కారణంగా మరణించి ఉండవచ్చని భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. బంధువులు గుర్తించేందుకుగాను మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్ మార్చురీలో భద్రపర్చినట్టు తెలిపారు. మృతుని ఆచూకీ కోసం కాకినాడ టౌన్ రైల్వేస్టేషన్లో ఉన్న జీఆర్పీ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ రవికుమార్ కోరారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

తొండంగి, ఫిబ్రవరి 6: మోటార్ సైకిల్ను మరో మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో తీవ్రంగా గాయపడి కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శివ(20) అనే యువకుడు మంగళవారం మృతి చెందినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. వేమవరం చేపల చెరువుల వద్ద పనిచేసే పి.శివ, వెంకట్, కె.గోవిందులు పైడికొండ వెళ్లి వేమవరం మోటార్ సైకిల్పై తిరిగి వస్తుండగా వేమవరం సమీపంలో వారి మోటార్ సైకిల్ను ఎదురుగా వస్తున్న మరో మోటార్ బైక్ బలంగా ఢీ కొంది. దీంతో శివ, వెంకట్లకు తీవ్ర గాయాలు కాగా గోవిందుకు స్వల్ప గాయాలయ్యాయి. శివ, వెంకట్లను తుని ఏరియా ఆసుపత్రికి అక్కడ నుంచి కాకినాడ తరలించగా శివ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

నష్ట పరిహారం కోసం ఎదురుచూపులు!

కిర్లంపూడి, ఫిబ్రవరి 6: గతేడాది సంభవించిన మిచౌంగ్ తుఫాన్ కారణంగా మండలంలో సుమారు 890 హెక్టార్లలో పంట మునిగింది. సుమారు 1763మంది రైతులు నష్టాల బారిన పడ్డారు. కానీ వారికి నష్ట పరిహారం ప్రభుత్వం అందించలేదు. దీంతో వారు నష్టపరిహారం కోసం ఎదురుచూస్తూ ఇప్పటికైనా అందించాలని కోరుతున్నారు.

టీడీపీ విజయానికి కృషి చేయాలి

» రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ » వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



కిర్లంపూడి: పాలెంలో టీడీపీలో చేరినవారితో నెహ్రూ

కిర్లంపూడి, ఫిబ్రవరి 6: వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి అందరూ కృషి చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ పిలుపునిచ్చారు. మండలంలో సింహాద్రిపురంలో వైసీపీకి చెందిన గ్రామ ఉపసర్పంచ్ నంది రాజారావు, వార్డు మెంబర్ నంది బాలకృష్ణ, ఉన్నత పాఠశాల చైర్మన్ నాగ గంగబాబు పలువురు ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. టీడీపీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా జ్యోతుల నెహ్రూ విచ్చేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలకు టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పాలెం గ్రామంలో వైసీపీకి చెందిన అడబాల కొండబాబు ఆధ్వర్యంలో కొప్పిశెట్టి బ్రదర్స్, ఏడిద బ్రదర్స్, ఆడారి బ్రదర్స్, అడబాల బ్రదర్స్, రావూరి బ్రదర్స్ తదితర 100 కుటుంబాలకు చెందిన వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. వారికి నెహ్రూ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆళ్ళ రవికిషోర్బాబు, పాఠంశెట్టి మరళీకృష్ణ, పాత, కొత్తకలయికతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. నియోజకవర్గంలో వైద్యం, విద్య కల్పనకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పార్టీ మండలాధ్యక్షుడు చదరం చంటిబాబు, ఎంపీపీ తోట రవి, తోట గాంధీ, కొత్తకొండబాబు, సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, కంచుమర్తి రాఘవ, అనుకుల శ్రీకాంత్, నీలం శ్రీను, సుంకవిల్లి రాజు, జంపన సీతారామచంద్రవర్మ, పాఠంశెట్టి బాబ్జి, జనసేన నాయకులు ఉలిసి అయిరాజు, టీడీపీ నాయకులు ఆళ్ళరవికిశోర్, ఆళ్ళ శివబాబు, బూత్ ఇన్చార్జ్ పాఠంశెట్టి పాపారావు, దాడి సుబ్బారావు, సర్పంచ్ జ్యోతుల రాంబాబు, పట్టు చంటిబాబు, ఉప సర్పంచ్ బొజ్జపు శ్రీను, ఎంపీటీసీ గరగ శ్రీను, గోడేబాల, ఆళ్ళ బాబ్జి ఉన్నారు.

కాండ్రేగులలో...

జగ్గంపేట రూరల్, ఫిబ్రవరి 6: మండలంలోని కాండ్రేగుల గ్రామం నుంచి పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి జ్యోతుల నెహ్రూ సమక్షంలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి నెహ్రూ సాదరంగా ఆహ్వానించారు. బొదిరెడ్డి చిన్నయ్య, బొదిరెడిడ్డ పార్వతీశ్వరరావు, అడబాల బాబురావు, బండారు శ్రీనివాస్, సురాబత్తుల శివ, కొప్పన శివ, సోమిశెట్టి ఏసుబాబు పార్టీలో చేరారు. రామిశెట్టి చంద్రరావు, యల్లపు దొరబాబు, రామిశెట్టి పాపారావు, బొదిరెడ్డి సత్యనారాయణ, అడపా తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే మహిళల అభ్యున్నతి

తుని ఇన్చార్జి యనమల దివ్య



తునిలో ప్రచారం నిర్వహిస్తున్న దివ్య

తుని రూరల్, ఫిబ్రవరి 6: మహిళల అభ్యున్నతి టీడీపీతోనే సాధ్యమని తుని నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి యనమల దివ్య అన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు నేతృత్వంలో మంగళవారం తుని 7వ వార్డులో యనమల దివ్య పార్టీ శ్రేణులతో కలిసి విస్తృత ప్రచారం చేపట్టారు. పార్టీ మేనిఫెస్టో కరపత్రాలు అందజేసి టీడీపీ, జనసేన పార్టీల మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుర్ల లోవరాజు, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్, టీడీపీ తుని పట్టణాధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, తుని జనసేన కోఆర్డినేటర్ పోలిశెట్టి వెంకటేష్, మోతుకూరి వెంకటేష్, మాజీ కౌన్సిలర్ దంతులూరి శ్రీనివాసరావు, పలకా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల సందర్శన



పోలింగ్ స్టేషన్ వద్ద ఆరా తీస్తున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), ఫిబ్రవరి 6: కాకినాడ సిటీ నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మంగళవారం పలు పోలింగ్ స్టేషన్లు సందర్శించారు. జగన్నాథపురంలోని ఏటిమొగ, కొండబాబుకాలనీ, గౌరీశంకరపేట, మత్స్యశాఖ కార్యాలయ ఆవరణలోని పిఎస్లకు వెళ్లిన ఆయన మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో మంచినీరు, విద్యుత్, ఫర్నీచర్, ర్యాంపులు, ఇతర సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించారు. ఏమైనా సదుపాయాలు కొరత ఉంటే వెంటనే నివేదిక ఇవ్వాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్లలో విధి నిర్వాహణలో ఉండే సిబ్బందికి ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట సూపర్వైజర్లు, బిఎల్వోలు తదితరులు ఉన్నారు.

సామర్లకోటలో ఆక్రమణల జోరు!

సామర్లకోట, ఫిబ్రవరి 6: సామర్లకోటలో ఇటీవల ఆక్రమణల జోరు పెరిగింది. ఇటీవల తహశీల్దార్ కార్యాలయం వెనుక ఎంపీడీవో కార్యాలయానికి చెందిన లక్షలు విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులతో ఆక్రమణలకు పాల్పడేలా అధికార పార్టీకి చెందిన నేత ఒకరు ప్రోత్సహించడంతో అధికార పార్టీలోని రెండవ గ్రూప్నకు చెందిన కొందరు మున్సిపల్ కమిషనర్కు చేసిన ఫిర్యాదుల మేరకు అప్పటికే అక్రమ నిర్మాణాలు చేసిన ఇంటిగోడలపై హెచ్చరికలతో కూడిన ఫెక్స్లను ఏర్పాటు చేశారు. అయితే ఈ అక్రమ నిర్మాణాలను ఏమాత్రం తొలగించకుండా అధికారులు మౌనం దాల్చేందుకు పెద్దఎత్తున ముడుపులు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆక్రమణదారులకు మున్సిపల్ కుళాయిలను వేసేందుకు ఏఈ అధికారి మంగళవారం మున్సిపల్ పైప్లైన్ సిబ్బందితో పనులు చేయించడంపై జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయమై కమిషనర్ జాస్తి రామారావు దృష్టికి తీసుకురాగా అక్రమ నిర్మాణదారులకు మున్సిపల్ సదుపాయాలు అందించడం నేరం అవుతుంది, తాను పరిశీలించి చర్యలు తీసుకుంటాననని స్పష్టం చేశారు.



సామర్లకోటలో అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ కమిషనర్ పేరిట ఏర్పాటు చేసిన హెచ్చరిక ఫ్లెక్సీ

9న తునికి షర్మిల రాక

రోడ్షో విజయవంతానికి కాంగ్రెస్ నేతల ఏర్పాట్లు



తునిలో మీడియాతో మాట్లాడుతున్న పద్మశ్రీ

తుని రూరల్, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఈ నెల 9న తునికి రానున్నారు. ఈ నేపథ్యంలో తునిలో జరగనున్న షర్మిల రోడ్ షోతో పాటు బహిరంగ సభ విజయవంతానికి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగరావు అధ్యక్షతన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం తునిలో మీడియాతో ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ షర్మిల రాకతో రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ని హక్కున చేర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. అవినీతి, అక్రమాలు అడ్డుగోలు పాలనలో సతమతమవుతున్న రాష్ట్ర ప్రజలకు నేనున్నానంటూ రాష్ట్రవ్యాప్త పర్యటన చేస్తున్న షర్మిల 9న తునికి విచ్చేస్తున్నట్టు తెలిపారు. పెద్ద ఎత్తున ప్రజలు, వైఎస్సార్ అభిమానులు తరలిరావాలని.. కాంగ్రెస్ తలపెడుతున్న రోడ్షో, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరారు. పాండురంగారావు మాట్లాడుతూ వైసీపీ అడ్డుగోలు పాలనతో రాష్ట్రం అధోగతి పాలైందని, కాంగ్రెస్తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని స్పష్టం చేశారు. వైసీపీ పాలకులు షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో పేటీఎం బ్యాచ్ తప్పుడు ప్రచారాలు మానుకోవాలని లేకుంటే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఏపీసీసీ జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ మారుతి నారాయణ చక్రవర్తి, గేలం శ్రీనివాస్, బాలం రాంబాబు పాల్గొన్నారు.

'విజయవంతం చేయండి'

రౌతులపూడి, ఫిబ్రవరి 6: ఈనెల 9న తునిలో జరిగే షర్మిల పర్యటన, రోడ్డు షోను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రత్తిపాడు ఇన్చార్జి ఉమ్మిడి వెంటేశ్వరరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం రౌతులపూడిలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల నుంచి అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మోయేటి సూర్యప్రకాశరావు, రాష్ట్ర బీసీసెల్ కోఆర్డినేటర్ కొల్లు వీర గణేష్, కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నిధులు తీసుకొస్తే రద్దు చేయించారు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



గొల్లప్రోలులో ప్రచారం నిర్వహిస్తున్న వర్మ

గొల్లప్రోలు, ఫిబ్రవరి 6: వరద ముంపు నుంచి శాశ్వత రక్షణ కోసం ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణకు రూ.156కోట్లు నిధులను పోరాడి తాను తీసుకువస్తే వైసీపీ ప్రజాప్రతినిధులు అవి అవసరం లేదంటూ రద్దు చేయించారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు పట్టణంలోని 12,15వ వార్డుల్లో మంగళవారం సాయంత్రం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, మన ఇంటికి మన వర్మ కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, చంద్రబాబు ప్రకటించిన సూపర్సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. గొల్లప్రోలు పట్టణంలోని కాలనీలన్ని తరచూ ముంపునకు గురవుతుండడంతో ప్రజలు పడుతున్న కష్టాలను చూసి అప్పటి ముఖ్యమంత్రి ద్వారా తాను నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. టెండర్లు ఖరారై, పనులు ప్రారంభించిన తర్వాత ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ పనులు అవసరం లేదని చెప్పి లేఖ ఇవ్వడంతో ఆ నిధులు వెనక్కి వెళ్లిపోయాయని చెప్పారు. తాను ఎమ్మెల్యేగా ఉండగా గొల్లప్రోలు నగరపంచాయతీని రూ.240కోట్లుతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. రూ.70కోట్లుతో మంచినీటి పథకాన్ని తీసుకువచ్చామని చెప్పారు. రానున్న రోజుల్లో ఇళ్లు లేని వారందరికి స్థలాలు కేటాయించి గృహనిర్మాణానికి నిధులు ఇస్తామని తెలిపారు. ఎన్నికల ముందు వచ్చే నాయకులు అధికారం, దోచుకోవడానికే వస్తారని.. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి మధ్యే ఉంటున్న తనకు అండగా నిలవాలని వర్మ కోరారు. పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు



ప్రత్తిపాడు సమావేశంలో పాల్గొన్న నాయకులు

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 6: ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు సురయు ఫంక్షన్ హాల్లో మంగళవారం నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. బీజేపీ ప్రధాన కార్యదర్శులు కాశీ విశ్వనాధరాజు, రావూరి సుధ, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ మాట్లాడుతూ ఈనెల 9,10,11న పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కార్యకర్త, నాయకుడు 24గంటల పాటు ప్రవాసయోజన చేసి వివిధ రంగా ల్లో ఉన్న వ్యక్తులను కలిసి పార్టీలోకి ఆహ్వానించడం, కేంద్రప్రభుత్వ పథకాలు వివరించడం చేయాలన్నారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి మోదీని ప్రధాని చేసి రాష్ట్రంలో బీజేపీకి అవకాశం కల్పించే విధంగా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. బూత్ కమిటీల నిర్మాణం, మహిళా సంఘాలతో సమావేశాలు, వివిధ చేతివృత్తిదారులను కలిసి మాట్లాడటం, రాత్రి సమయాల్లో పల్లె నిద్ర చేయడం వంటి కార్యక్రమాలతో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాబోయే 2 నెలలు కార్యకర్తలు కష్టించాలన్నారు. కార్యక్రమం లో జిల్లా కిసాన్మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, నాయకులు గంటా బాలుదొర, రంబాల వెంకటేశ్వరరావు, మట్టా మంగరాజు, కొల్లా శ్రీనివాస్, దాకే కృష్ణారావు, వెలుగూరి హరేరాం, కందా వీరాస్వామి, తుమ్మల పద్మజ, కామినేని జయశ్రీ, గట్టెం వెంకటరమణ, కించు జోగిరాజు, చిట్ర పాపారావుతో, ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండల ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు మరిడమ్మ హుండీల లెక్కింపు

పెద్దాపురం, ఫిబ్రవరి 6: మరిడమ్మ హుండీల ఆదాయాన్ని ఈనెల 8న లెక్కించనున్నట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిష నర్ చేబ్రోలు రామ్మోహనరావు తెలిపారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో ఈ లెక్కింపు ప్రక్రియ ఉంటుందని చెప్పారు.

ఈక్రాప్ నమోదును పూర్తి చేయాలి

జిల్లా వ్యవసాయాధికారి హరి



పిఠాపురంలో మాట్లాడుతున్న హరి

పిఠాపురం, ఫిబ్రవరి 6: రబీలో పంటల సాగుకు సంబంధించి ఈ క్రాప్ నమోదును ఈనెల 15లోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి బీవీఎస్.హరి ఆదేశించారు. పిఠాపురంలోని వ్యవసాయశాఖ కార్యాయంలో సబ్డివిజన్ పరిధిలోని వ్యవసాయాధికారులు, వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ క్రాప్ నమోదుతో వెనుకబడిన సిబ్బంది తమ పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఆర్బీకేల ద్వారా అందుబాటులో ఉన్న ఎరువులు, విక్రయాలు జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. రబీసాగుకు సాగునీటి లభ్యతపై ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ సమస్య ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, వ్యవసాయాధికారులు అచ్యుతరావు, సత్యనారాయణ, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్వోగా నాయక్ బాధ్యతలు

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లాలో డిప్యూటీ కలెక్టర్గా విధులు నిర్వర్తిస్తున్న డి.తిప్పే నాయక్ మంగళవారం కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కృతికాశుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే చింతూరు ఎటపాక-1 స్పెషల్ డిప్యూటీ కలెక్టర్గా విధులు నిర్వర్తిస్తున్న మర్రిపూడి శ్రీనివాసరావు ఏపీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ కాకినాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్గా బదిలీ అయ్యారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్వో సుజాత

పెద్దాపురం, ఫిబ్రవరి 6: మండలంలోని కొండపల్లి గ్రామంలో ఉద్యాన పంటల సాగుపై రైతులకు ఉద్యాన శాఖాధికారిణి నూనే సుజాత ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆయిల్పామ్ సాగు, యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, తెగుళ్లు, అధిక దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సి చర్యలు తదితర విషయాలపై వివరించారు. కార్యక్రమంలో పతంజలి ఫుడ్స్ డీజీఎం రవీంద్ర, మేనేజర్ వెంకటేశ్వరరావు, వీహెచ్ఏ చంద్రరావు, క్లస్టర్ ఇన్చార్జ్ వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి

శంఖవరం, ఫిబ్రవరి 6: జగనన్న ఇళ్ల స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చెయ్యాలని ఎంపీడీవో ఎం.విజయకుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను ఆయన పరిశీలించారు. కట్టుకున్న ఇళ్లను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు చేస్తున్నామని, లబ్ధిదారులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

'రైతులకు న్యాయం చేయాలి'

శంఖవరం, ఫిబ్రవరి 6: పంటనష్టపోయిన రైతులకు కాకుండా అధికార పార్టీ నేతల పేరిట పరిహారాన్ని రాసిన అధికారులపై చర్యలు చేపట్టి నిజమైన రైతులకు న్యాయం చేయాలని రైతులు కోరారు. ఈ మేరకు నూతన తహశీల్దార్ రాజకుమారికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టాలని, త్వరగతిన పంటనష్ట పరిహారంవచ్చేలా ఉన్నతాధికారులకు నివేదించాలని కోరారు.

టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ

పెద్దాపురం, ఫిబ్రవరి 6: స్థానిక వాలుతిమ్మాపురం రహదారిలో ఉన్న టిడ్కో గృహసముదాయాల వద్ద లబ్ధిదారులకు రెండో విడత ఇళ్ల పట్టాల పంపిణీ మంగళవారం నిర్వహించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్చార్జి దవులూరి దొరబాబు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమీషనర్ కేవీ పద్మావతి, డీఈ ఆదినారాయణ, శానిటరీ ఇనస్పెక్టర్ దావీదురాజు, కౌన్సిలర్ అరెళ్ల వీర్రాఘవరావు, త్సలికి సత్య బాస్కరరావు,కోఆప్షన్ సభ్యుడు వాసంశెట్టి గంగ పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపిక

గండేపల్లి, ఫిబ్రవరి 6: సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థలకు చెందిన ఫార్మశీ కళాశాలల నందు బెంగుళూరుకు చెందిన మెడ్ టెక్ ఫార్మా కంపెనీ నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్మెంట్లో ఆదిత్య ఫార్మశీ చెందిన 33 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు రూ.2.80లక్షల వార్షిక వేతనం లభిస్తుందన్నారు. అభ్యర్థులను విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్రెడ్డి, ప్రిన్సిపాల్స్, పలువురు అభినందించారు.

హెల్త్ కార్డుల పంపిణీ పరిశీలన

కరప, ఫిబ్రవరి 6: ప్రభుత్వం జారీచేసిన ఆరోగ్యశ్రీ కార్డులను ప్రజలకు సకాలంలో పంపిణీచేయాలని ఎంపీడీవో కొంకి అప్పారావు సూచించారు. గురజనాపల్లి గ్రామంలో మంగళవారం మండల వైద్యాధికారి రమావత్ శ్రీనివాసనాయక్ కల్సి హెల్త్ కార్డుల పంపిణీని పరిశీలించారు. మండలంలో 25,596 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా ఇంతవరకు 18,994 కుటుంబాలకు అందించామని, మిగిలినవారికి అందజేయాలని వలంటీర్లు, వైద్యసిబ్బందికి సూచించారు.

సినిమా గైడ్

కాకినాడ

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: గేమ్ ఆన్ , అంబాజీపేట మ్యారేజిబ్యాండు, గుంటూరు కారం, కెప్టెన్ మిల్లర్

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: నా సామిరంగ, హైందవ, గుంటూరు కారం, కెప్టెన్ మిల్లర్, అంబాజీపేట మ్యారేజిబ్యాండు, గేమ్ఆన్

తిరుమల	:	ధీర
లక్ష్మి	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సీ అండ్సీ1	:	బూట్కట్ బాలరాజు
సీ అండ్సీ2	:	హనుమాన్
శ్రీప్రియ	:	గుంటూరుకారం
పద్మప్రియ	:	అంబాజీ మ్యారేజిబ్యాండు
సత్యగౌరి	:	నా సామిరంగ
సూర్య 1	:	గుంటూరు కారం
సూర్య 2	:	అంబాజీ మ్యారేజిబ్యాండు

అధ్వానంగా రహదారులు!

వాహనదారులకు అవస్థలు, పట్టించుకోని అధికారులు





రౌతులపూడి మండలంలో అధ్వాన రహదారులు

రౌతులపూడి, ఫిబ్రవరి 6: మండల గ్రామాల్లో జిల్లా పరిషత్ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. ఈ రహదారుల్లో ప్రయాణించడానికి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఈ రహదారులను 15 ఏళ్ల క్రితం నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. ముఖ్యంగా సబ్ప్లాన్ ఏజెన్సీ గ్రామాల్లో రహదారులు మరింత దారుణంగా ఉన్నాయి. వైద్యం అత్యవసర పరిస్థితుల్లో వాహనాలపై రోగులను తరలించాలంటే నరకం చూస్తున్నారు. రౌతులపూడి మండలం నుంచి ముఖ్యంగా సబ్ప్లాన్ ఏరియా పరిధిలో నుంచే జిల్లా పరిషత్కు మైనింగ్ నిధులు ఎక్కువ వెళ్తున్నాయి. కాకినాడ జిల్లాలోనే రౌతులపూడి మండలం నుంచి మైనింగ్ నిధులు ఎక్కువగా ముట్ట చెబుతున్నారు. అలాంటిది 15 ఏళ్ల నుంచి జిల్లా పరిషత్ రహదారులు ఎక్కడ వెయ్యకపోగా కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా ప్రాంతం నుంచి వస్తున్న మైనింగ్ నిధులు కూడా మామండలానికి ఉపయోగించకపోవడం దారుణమని వాపోతున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది అల్పా సంఖ్యాక వర్గానికి చెందిన కావడం, జిల్లాకు మా మండలం చివరగా ఉండడంతో చులకనగా చూస్తున్నారని ప్రజలు, వాహనదారులు అంటున్నారు. ఎంతమంది జిల్లా పరిషత్ చైర్మన్లు మారినా మా పరిస్థితులు మారలేదని వాపోతున్నారు. జిల్లా పరిషత్లో నిధులు లేకపోతే కనీసం అర్అండ్బీలోనైనా మా రహదారులను కలిపి న్యాయంచేయాలని వారు కోరుతున్నారు.